# నిధుల లేమితో నిలిచిన చెత్త!

## జనావాసాల మధ్యే పేరుకుపోతున్న చెత్త కుప్పలు

- గతంలోనే డంపింగ్ కేంద్రం తరలించాలని కోర్టు, పీసీబీ ఆదేశాలు
- తరలింపులో జాప్యంతో ఇప్పటికే రెండు సార్లు కార్పొరేషన్‌కు జరిమానా

**బాచుపల్లి డంపింగ్ కేంద్రంలో చెత్త పేరుకు పోవడంతో చుట్టపక్కల కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. డంపింగ్ యార్డు తరలించాలని కోర్టు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదేశించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో పీసీబీ కార్పొరేషన్‌కు రెండు సార్లు జరిమానా విధించింది. చెత్త డంపింగ్ యార్డును ఎత్తేయడం పక్కన పెడితే.. ప్రస్తుతం ఉన్న చెత్తను నెల రోజుల నుంచి నిధుల లేమితో జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించడం ఆపేశారు. దీంతో డంపింగ్ యార్డులో గుట్టలుగా చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కోర్టు ఆదేశానుసారం డంపింగ్ కేంద్రాన్ని తరలించాలని, ఆ లోగా చెత్తను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.**

**నిజాంపేట్:** నాడు గ్రామ పంచాయతీలుగా ఉన్న బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌ల నుంచి తరలించిన చెత్తను డంపింగ్ చేసేందుకు సర్వే నెంబర్ 186లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. అనంతరం కార్పొరేషన్ ఏర్పడిన తరువాత రోజు రోజుకు పెరుగుతున్న జనాభాతో డంపింగ్ యార్డు జనఆవాసాల మధ్య అయిపోయింది. ప్రస్తుతం డబుల్ బెడ్‌రూం వాసులు, సాయినగర్, ఆదిత్య గార్డెన్స్, హిల్ కౌంటీ, స్ప్రింగ్ వ్యాలీ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీల ప్రజలు డంపింగ్ యార్డు మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### నిలిచిన చెత్త తరలింపు

ప్రతి రోజు నిజాంపేట్ కార్పొరేషన్‌లోని వివిధ కాలనీల నుంచి సుమారు 120 టన్నుల చెత్త డంపింగ్ యార్డుకు చేరుతోంది. ఈ చెత్తను ఇక్కడి నుంచి టిప్పర్‌లలో జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించాలి. చెత్త తరలించే టిప్పర్‌లకు ఒక్కో దానికి సుమారు రూ.8,600 చెల్లిస్తూ ప్రతి నెల నెల రూ.50 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. అయితే నిజాంపేట్ నుంచి చెత్త తరలించే కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో చెత్త తరలింపును నిలిపివేసినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో చెత్తను ప్రాసెస్ చేయడానికి చెల్లించాల్సిన నిధులు సైతం రూ.5 కోట్ల వరకు నిజాంపేట్ కార్పొరేషన్ పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది.



డంపింగ్ యార్డులో కుప్పలుకుప్పలుగా పేరుకుపోయిన చెత్త

### ఇబ్బందులు పడుతున్నాం.. తరలించాలి



చెత్త డంపింగ్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డు కోసం ప్రత్యామ్నాయంగా మరో ప్రాంతాన్ని ఎంపిక చేయాలి. ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే అనేక సార్లు అన్ని విభాగాల అధికారులకు ఫిర్యాదు చేశాం.

– రాజేందర్‌రెడ్డి, హిల్ కౌంటీ విల్లాస్ చైర్మన్

### తరలింపులో నిర్లక్ష్యమెందుకు?



డంపింగ్ యార్డు నుంచి బయటకు వచ్చిన చెత్త

బాచుపల్లి సర్వే నెంబర్ 186లోని చెత్త డంపింగ్ యార్డు తరలించాలని హిల్ కౌంటీ వాసులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. వారు సమస్యను పరిష్కరించలేకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో డంపింగ్ యార్డును తరలించాని కోర్టు 2022లో నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదేశించింది. అంతే గాకుండా పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు సైతం పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పీసీబీ 6 నెలల్లో డంపింగ్ యార్డును తరలించాలని అధికారులను ఆదేశించింది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు రెండు సార్లు రూ.25 వేల చొప్పున జరిమానా కూడా విధించింది.

### తగులబడుతున్న చెత్త



తగులబడుతున్న చెత్త(ఫైల్)

డంపింగ్ యార్డులోని చెత్తలో తరచు మంటలు రావడంతో వాయు కాలుష్యం ఏర్పడి విష వాయువులతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. చెత్తను కావాలనే తగులబెడుతున్నారా? లేక రసాయనాల చర్యల వల్ల చెత్త తగులబడుతుందా? అనేది తెలియాల్సి ఉంది. గతంలో చెత్తను తగుల బెడుతున్న పలువురిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు హిల్ కౌంటీ వాసులు పేర్కొంటున్నారు. ఇంతటి ప్రమాదకరమైన సమస్యను పరిష్కరించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### డంపింగ్ యార్డును తరలించాలి



ఒకప్పుడు బాచుపల్లి పరిసర ప్రాంతాలు ప్రశాంతంగా ఉండేవి. చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి ప్రజల జీవన ప్రమాణాన్ని చిన్నాభిన్నం చేశారు. చెత్తను తగులబెట్టే క్రమంలో వెలువడే విష వాయువులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కోర్టు మందలించిన డంపింగ్ యార్డు తరలించే ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా అధికారులు వెంటనే డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి త్వరగా తరలించాలి.

– డాక్టర్ సునీల్, మాజీ చైర్మన్, హిల్ కౌంటీ విల్లాస్.

### నెల రోజుల్లో తరలిస్తాం



డంపింగ్ యార్డును తరలించాలని ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నాం. దుండిగల్‌లోని రాంకీలో లేదా కూకట్‌పల్లిలోని జీహెచ్ఎంసీ స్థలంలో డంపింగ్ యార్డు కోసం ఉన్నతాధికారులకు లెటర్ పెట్టాం. ఈ రెండింటిలో ఎక్కడ అవకాశం వస్తే అక్కడకు వెంటనే షిఫ్ట్ చేస్తాము. డంపింగ్ యార్డు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. ప్రజల బాగు కోసమే తాము పని చేస్తున్నాం. నెల రోజుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

– సాబేర్ అలీ, కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్

## విద్యార్థులు ఒత్తిడిని జయించాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

**సుభాష్‌నగర్:** హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు యోగా, మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించి చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. మెడిటేషన్ ద్వారా మానసిక ఆరోగ్యాన్ని ఎలా పొందవచ్చు అనే అంశంపై సంస్థ ప్రతినిధులు విజయలక్ష్మి, సత్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో యోగా, మెడిటేషన్ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉపేందర్, ఉపేందర్ రావు, పరశురాం, సత్యనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసరాలు అందజేత





పంపిణీ చేసేందుకు సేకరించిన కిరాణ సామగ్రి

**నిజాంపేట్:** సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములు చేస్తున్నామని నిజాంపేట్ రాజధాని రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ గ్రీష్మాచౌదరి అన్నారు. మియాపూర్ రోడ్డు పక్కన ఉండే పేద ప్రజలకు బుధవారం విద్యార్థుల పాకెట్‌మనీతో బియ్యం, కందిపప్పు, వంటనూనె తదితర వస్తు సామగ్రిని కొనుగోలు చేసి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు మక్కపాటి చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యక్షురాలు వనజలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు తవ్విన ఇద్దరిపై కేసు నమోదు

**దుండిగల్:** రోడ్డును తవ్విన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్‌కే కళాశాల నుంచి బౌరంపేట ప్రాంతానికి గతంలో రోడ్డు వేశారు. ఇటీవల ఇదే రోడ్డులోని కొంత ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు సబ్ స్టేషన్‌కు కేటాయించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు నిర్మాణ పనులు చేట్టారు. అదే మార్గంలో అంబిటస్ స్కూల్ వద్ద రోడ్డును కొందరు వ్యక్తులు ఆక్రమించి తొలగించారు. గ్రామస్తులు, రైతులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అక్కడి వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. వెంటనే సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి తోడు గ్రామస్తులు సైతం ఇదే విషయాన్ని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రోడ్డును తవ్విన సీహెచ్ రామ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు వారిద్దరిపై 447 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బతుకమ్మకుంటను శుభ్రం చేయరా?



**రంగారెడ్డినగర్:** బతుకమ్మల నిమజ్జనాల కోసం నిర్మించిన బతుకమ్మ కుంట నిర్వహణ లేకపోవడంతో దుర్గంధ భరితంగా మారింది. రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆనుకుని సర్కిల్ అధికారులు స్థానికంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించిన అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వీలుగా కుంటను ఏర్పాటు చేశారు. కుంటలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దురాస్వసన వస్తోంది. సమీపంలోనే పాఠశాల ఉండటంతో విద్యార్థుల ఆరోగ్యాలపై ప్రభావం చూపే ఆస్కారముందని స్థానికులు పేర్కొంటున్నారు. దోమల బ్రీడింగ్ కేంద్రంగా మారిన బతుకమ్మ కుంటను శుభ్రం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకలు



**సుభాష్‌నగర్:** సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలో హాన్స్ హైదరాబాద్ ఆర్చ్ డియోసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సెమీ క్రిస్మస్ నిర్వహించారు. ప్రోగ్రాం రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రీతి సునంద నేతృత్వంలో ట్రాన్స్‌జెండర్లు, స్వయం సహాయ సంఘాలతో నిర్వహించిన ఈ సెమీ క్రిస్మస్ కార్యక్రమానికి కార్డినల్ పులా ఆంథోని, పిడబ్ల్యూడి, ట్రాన్స్‌జెండర్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రాన్స్‌జెండర్లకు జ్యూట్ బ్యాగులు, మగ్గం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. స్వయం సహాయ సంఘాల వారికి కుట్టు మిషన్లను అందజేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

## అంగన్‌వాడీలో సామూహిక సీమంతాలు



**రంగారెడ్డినగర్:** రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, పల్లె వెలుగు డాక్టర్ జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారం, కోడి గుడ్లను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లలిత, జ్ఞానేశ్వరి, ప్రభావతి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

## సీబీఎస్పీ మెంబర్‌గా శ్యామ్‌రావు

**సుభాష్‌నగర్:** దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లికి చెందిన బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి శ్యామ్‌రావుకు కేంద్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిమ్స్ సర్టిఫికేషన్ అడ్వైజర్ ప్యానెల్ మెంబర్‌గా నియమిస్తూ సీబీఎస్సీ రీజినల్ ఆఫీసర్ శిఫాలి కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దాసరి శ్యామ్ రావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి పనిచేస్తూ అంచలంచలుగా ఎదుగుతూ రాష్ట్ర స్థాయి వరకు ఎదిగానన్నారు. కేంద్ర ప్రభుత్వం తనకు ఈ స్థానం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో కళాశాల బృందం

**దుండిగల్:** మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థులకు సైబేజ్ కుష్ఫు సంస్థ స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. ఆర్థికంగా వెనుకబడి ఉన్న 14 మంది విద్యార్థులను గుర్తించి ప్రస్తుత విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్‌లను నగరంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం అందజేశారు. గత సంవత్సరం విద్యార్థులకు రూ.8.6 లక్షలు అందించగా.. ఈ విద్యా సంవత్సరం రూ.10.55 లక్షలకు పెంచింది. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశంలో వేలాది మంది విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనందించామని, చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో నిరు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్, సీఎస్ఆర్ హెడ్ రీతు నాథని, వైస్ ప్రెసిడెంట్ సురేశ్ మామునూరు, పుట్టా వెంకటేశ్వర శర్మ, సీనియర్ ఎగ్జిక్యూటీవ్ సురేశ్, ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ప్లేస్‌మెంట్ హెడ్ రవిచంద్ర, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, అంజనా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## 23న ఆలయ పుష్కరిణి పునరుద్ధరణ కార్యక్రమం

**కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో ఈ నెల 23న పుష్కరిణీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉదయం 9.45 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

**సుభాష్‌నగర్:** కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో కొంత మంది గదిని నిర్మించడంతో రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. సూరారం సాయిబాబా నగర్‌లో సర్వే నంబర్ 49/7 స్థలం గత కొంత కాలంగా గణేష్‌నగర్ ప్లాట్ ఓనర్ అసోసియేషన్, రెవెన్యూ అధికారుల మధ్య వివాదం నడుస్తోంది. దీంతో చుట్టుప్రక్కల కబ్జాలు చేస్తుండగా గణేష్‌నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ వారు రెండు వేల గజాల చుట్టూ కబ్జా కాకుండా ప్రహరీ నిర్మించి కోర్టు తీర్పు కోసం వేచి చూస్తున్నారు. ఈ తరుణంలో కొంతమంది మంగళవారం రాత్రి గదిని నిర్మించారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ రెహమాన్‌ఖాన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం బుధవారం తమ సిబ్బందితో గదిని కూల్చివేశారు. సదరు స్థలంలో నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.





# పన్ను వసూళ్లపై స్పెషల్ ఫోకస్

- పట్టణాలు, గ్రామాల్లో పేరుకుపోయిన పాత బకాయిలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో వసూళ్ల లక్ష్యం రూ.182 కోట్లు
- వసూలైన పన్ను శాతం 54.80
- స్పెషల్ డ్రైవ్‌తో రంగంలోకి ప్రత్యేక బృందాలు
- వందశాతం వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ



**సాక్షి,సిటీబ్యూరో:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పట్టణాలు (పురపాలికలు), గ్రామ పంచాయతీ (జీపీ)ల్లో పాత బకాయిలతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టిసారిస్తోంది. వచ్చే మార్చితో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో లక్ష్యాన్ని అధిగమించేలా పురపాలక సంఘాలు, జీపీలు స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమవుతున్నాయి. వీరిని రంగంలోకి దింపటం ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని భావిస్తుంది. ఇంకా మూడు నెలలు మాత్రమే గడువు ఉండటంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పట్టణాలు, జీపీల్లో పన్నుల వసూళ్లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. లేని పక్షంలో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడగలదని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాలని భావిస్తోంది.

### పట్టణాలు.. జీపీల్లో పన్నుల లక్ష్యం రూ.182 కోట్లు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాలతోపాటు 34 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.182 కోట్లు (పురపాలక సంఘాల్లో రూ.172 కోట్లు, జీపీల్లో రూ.10.76 కోట్లు) కాగా, ఇప్పటి వరకు 54.80 శాతం పన్నుల వసూళ్లు చేశారు. వచ్చే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. అప్పటి వరకు వంద శాతం పన్నుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్‌కు అధికార యంత్రాంగం మొగ్గు చూపుతోంది. మార్చి 31 వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఇవ్వగా, ఆ తర్వాత చెల్లించిన వారికి 2 శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. పట్టణాలు, జీపీల్లో ప్రైవేట్ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా.. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటా పెరిగిపోతున్నాయి.

### పేరుకుపోయిన బకాయిలతో కష్టాలు..

పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో ప్రతి ఏటా సకాలంలో పన్నులు వసూలు కావటం లేదు. రూ.కోట్లల్లో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. దీనికి తోడు పురపాలక సంఘాలు, జీపీల్లో పని చేస్తున్న సిబ్బంది జీతభత్యాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి నుంచి పట్టణాలు, జీపీలు బయటపడాలంటే పన్నులు సకాలంలో వసూలు కావాల్సిన అవసరం ఉంది.

## జడ్పీహెచ్ఎస్‌లో జన్యా ఈవెంట్స్





విద్యార్థులు రూపొందించిన నమూనాలు

**నిజాంపేట్:** జన్యా ల్యాబ్ ఇన్ ఏ బాక్స్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం బాచుపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జన్యా ఈవెంట్స్ పేరిట సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. గ్లాండ్ ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో జన్యా సైంటిఫిక్ రంగోలి, జన్యా క్రియేటీవ్ ఫేర్, జన్యా సోషన్ ఇన్నోవేషన్ చాలెంజ్‌ను నిర్వహించారు. విద్యార్థులు సైన్స్, గణిత చార్టులు, డయాగ్రామ్స్‌ను రంగోలి రూపంలో ఆవిష్కరించారు. అదే విధంగా జన్యా టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) డుప్లికేషన్ తయారు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, జన్యా ఫౌండేషన్ ప్రతినిధి రామ్ పుట్ట, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అరుణాక్షర కవిత తోరణాల అవార్డు ప్రదానం

**చింతల్:** రంగారెడ్డినగర్‌కు చెందిన అభినవ కవి, మానస టూల్‌టెక్ అధినేత వాకిటి రామ్‌రెడ్డి అరుణాక్షర కవిత తోరణాల అవార్డును అందుకున్నారు. ఆయన రాసిన మరపురాని బంధం కవితకు ఈ అవార్డు దక్కింది. సంస్థ అధ్యక్షురాలు అరుణ కోదాటి, ఆత్మీయ అతిథి కృష్ణక్క, నాయకంటి నరసింహారావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ కలెక్టర్, ప్రముఖ కవి ఏనుగు నరసింహారెడ్డి, పలువురు సాహితీ వేత్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.